ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర

లింగపాలెం: పేదలకు ఉపాధి కల్పిస్తోన్న ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు పాలక వర్గాలు కుట్ర చేస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ ఆరోపించారు. మంగళవారం ఆయన లింగపాలెం మండలం అయ్యపరాజుగూడెం గ్రామంలో ఉపాధి హామీ కూలీల పని ప్రదేశాలను ఆయన పర్యటించారు. పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ పథకాన్ని తిరిగి పోరాడి రక్షించుకొనేందుకు మే 20న ఉపాధి పనులు బంద్ చేయాలని, మండల కేంద్రాలు, గ్రామ సచివాలయాల వద్ద నిరసన ప్రదర్శనలు, ధర్నాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యుడు అప్పలస్వామి మాట్లాడుతూ 100 రోజులు పనులు చూపించాలంటే కేంద్ర బడ్జెట్లో 2.50 లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. నిధులు కోతతో కనీసం 30 రోజులు కూడా పనులు దక్కడం లేదని ఆరోపించారు. పని చేసిన రెండు వారాల్లోపు వేతనాలు ఇవ్వాల్సి ఉన్నా, ఐదు వారాలుగా వేతనాలు ఇవ్వడం లేదని మండి పడ్డారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు రాజశేఖర్ మెట్లు మధు, ఉషారాణి, అనిత, గోపి, జ్యోతి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


లింగపాలెం : కూలీల సమస్యలను తెలుసుకుంటున్న రామకృష్ణ


కామవరపుకోట : మస్తర్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ సరళ కుమారి

రూ.300 వేతనం ఇవ్వాలి

కామవరపుకోట: ఉపాధి హామీ పథకం కూలీలకు ఖచ్చితంగా సరాసరి వేతనం రూ.300 వచ్చే విధంగా క్షేత్ర స్థాయి సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎం సరళ కుమారి అన్నారు. మంగళవారం కామవరపుకోట మండలం తడికలపూడి గ్రామంలోని లింగరాజులకుంట చెరువు వద్ద ఆమె పనికి సంబంధించిన మస్తర్లను పరిశీలించారు. పని ప్రదేశంలో సౌకర్యాలన్నీ ఏర్పాటు చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

క్లుప్తంగా

గిరిజన సలహా మండలి ఏర్పాటు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బుట్టాయగూడెం: గిరిజన సలహా మండలి ఏర్పాటు చేయాలని, షెడ్యూల్ ప్రాంతానికి ప్రత్యేక నోటిఫికేషన్ ప్రకటించాలని జిల్లా ఆదివాసీ కార్యాచరణ కమిటీ చైర్మన్ మొడియం శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆ సంఘ సమావేశం బుట్టాయగూడెం మండలం బూసరాజుపల్లి శివారులో కొత్తసింగన్నపల్లి కమ్యూనిటీ హాల్ వద్ద మంగళవారం సాయంత్రం నిర్వహించారు. సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ గిరిజన సలహా మండలి ఏర్పాటు చేసి షెడ్యూల్ ప్రాంతాల్లోని ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. నాయకులు సోడెం ముక్కయ్య, తెల్లం లక్ష్మణరావు, తెల్లం రవిప్రసాద్, ఏటీఏ నాయకులు పి.రాములు, ఎస్ నాగేశ్వరరావు, సోడెం రాజు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం


దాతకు విరాళం బాండ్ పత్రం అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకాని అశ్వారావుపేటకు చెందిన సమయమంతుల చక్రధరరావు మంగళవారం రూ.1,00,116లను విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దాతకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు. తొలుత దాత చక్రధరరావు సతీసమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

మేరీ మాత ఆలయం ప్రారంభం


మేరీ మాత ఆలయాన్ని ప్రారంభించిన బిషప్ జయరావు

లింగపాలెం: మండలంలోని పాశ్చానగరం విచారణ, తొమ్మండ్రువారిగూడెంలో వేళాంకణి మేరీమాత నూతన ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం మంగళవారం నిర్వహించారు. హేలాపురి కాథలిక్ పీఠాధిపతులు పొలిమేర జయరావు, ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌లు పాల్గొని పరిశుద్ధ మందిరాన్ని ప్రారంభించారు. జయరావు, రోషన్‌కుమార్‌లకు సంప్రాదాయ బద్ధంగా, కోలాట నృత్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, పలువురు గురువులు, సిస్టర్లు, ఉపదేశీ మాస్టర్లు, భక్తులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

ద్వారకాతిరుమల: కిశోర వికాసం 2.0 కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక సంతమార్కెట్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో సచివాలయం జీఎంఎస్‌కే కె.లక్ష్మీసుజన బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ఫోక్సో చట్టం 18 ఏళ్లలోపు పిల్లలకు రక్షణ కల్పిస్తుందని తెలిపారు. బాల్య వివాహ నిషేధం, బాల కార్మిక నిర్మూలన, విద్యా, ఉచిత నిర్బంద విద్య ద్వారా పిల్లల జీవితాలు మెరుగుపడుతున్నాయని వివరించారు. పిల్లలపై లైంగిక దాడికి పాల్పడే వ్యక్తికి మూడేళ్ల నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష, లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తారని తెలిపారు. లైంగిక వేధింపులు, దాడులకు గురైన బాధితులు వెంటనే పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరి బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ సందర్భంగా బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ సాధిద్దామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎం, మహిళలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.


ద్వారకాతిరుమల సంత మార్కెట్ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

బాల్య వివాహాలతో అనర్థాలు

బుట్టాయగూడెం: బాల్య వివాహాలు చేయడం వల్ల అనేక అనర్థాలు సంభవిస్తాయని ఎంపీడీఓ కె.జ్యోతి హెచ్చరించారు. బుట్టాయగూడెం అంగన్‌వాడీ సెంటర్-5ను ఆమె మంగళవారం సందర్శించారు. బాలికల ఆరోగ్యం, పోషకాహారం, లైఫ్ స్కిల్స్, హక్కులు వంటి విషయాలపై అవగాహన కలిగించారు. సూపర్‌వైజర్ ఝాన్సీ, అంగన్‌వాడీ టీచర్‌లు ఎ.శ్యామల, మున్ని, నూర్జహాన్, తల్లులు, కిశోర బాలికలు, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

కామవరపుకోట: బాలల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జంగారెడ్డిగూడెం ప్రాజెక్ట్ అంగన్‌వాడీ సీడీపీఓ పి.బ్యూలా అన్నారు. మంగళవారం ఉప్పలపాడు గ్రామ సచివాలయ పరిధి రామన్నపాలెం పంచాయతీ కొత్తూరువారిగూడెం అంగన్‌వాడీ సెంటర్‌లో కిషోర వికాసం వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా బాలల హక్కుల చట్టం, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్సై పి.చెన్నారావు మాట్లాడుతూ పోక్సో చట్టం, ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కార్యక్రమంలో ఉప్పలపాడు జీఎంఎస్‌కే ఎం భారతి, అంగన్‌వాడీ కామవరపుకోట సెక్టార్ సూపర్‌వైజర్ బి.మంగాదేవి, ఉప్పలపాడు సచివాలయ పరిధి అంగన్‌వాడీ వర్కర్స్, ఆయాలు, ఆశ వర్కర్స్, కిషోర బాలికలు పాల్గొన్నారు.

తాగునీటి బోరు ప్రారంభం


మంచినీటి బోరు ప్రారంభిస్తున్న దృశ్యం

కామవరపుకోట: స్థానిక పాతూరు గుడ్ల గురవమ్మవారి ఆలయ సమీపంలో మంచినీటి కోసం వేసిన పంచాయతీ నిధులు రూ.2.10 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.4 లక్షలతో ఏర్పాటుచేసిన కొత్త బోరును మంగళవారం ప్రారంభించారు. ఈ బోరు నుంచి పాతూరు, కామవరపుకోట టౌన్‌కు మంచినీటి సౌకర్యం కల్పించనున్నారు. ఉప సర్పంచ్ మేడూరి రంగబాబుతో పాటు పంచాయతీ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు తమ్మిశెట్టి సుబ్రహ్మణ్యం, ఘంటా భాస్కరరావు, తుమ్మలపల్లి శ్రీనివాసరావు, సాయిన ప్రభాకరరావు, సాయిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జనుము విత్తనాల పంపిణీ


జనుము విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: రైతులు తమ పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలు పెంచడం ద్వారా భూసారాన్ని పెంచుకోవాలని వైస్ సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని శ్రీనివాసపురం రైతు సేవా కేంద్రంలో జనుము విత్తనాలను ఆయన చేతుల మీదుగా రైతులకు అందజేశారు. కార్యక్రమానికి రైతు సేవా కేంద్రం ఇన్‌ఛార్జి ఎం షాలిని, రైతులు పాల్గొన్నారు.

ఒకే కాన్పులో రెండు పెయ్యిలు


కవలదూడలకు జన్మనిచ్చిన ఆవు

జంగారెడ్డిగూడెం: ఆవు ఒకే కాన్పులో రెండు పెయ్యలకు జన్మనిచ్చింది. జంగారెడ్డిగూడెంకు చెందిన డాక్టర్ రాజాన సత్యనారాయణకు చెందిన సూర్య గార్డెన్స్‌లో ఉన్న ఆవుకు మంగళవారం కవల దూడలు పుట్టాయి. ఒకేసారి ఆవుకు రెండు పెయ్యిలు పుట్టడం శుభ సూచకంగా భావిస్తారని సత్యనారాయణ తెలిపారు.

పూడిక, పొదలతో నిండిన ఆంధ్రా కాలువ

చింతలపూడి : మండలంలోని రాఘవాపురం ఇరిగేషన్ సెక్షన్ పరిధిలో ఉన్న ఆంధ్రా కాలువ పూడుకుపోయి దశాబ్దాలు కావస్తోంది. ఈ కాలువకు అనేక చోట్ల గండ్లు కూడా పడ్డాయి. ఆయకట్టు రైతులు అనేక ఏళ్లుగా మొర పెట్టుకుంటున్నా కాలువ గండ్లను పూడ్చడం లేదు. ఏటా కురిసిన వర్షాలకు వరద నీరు పంట పొలాలపై నుంచి ప్రవహించి వృధాగా పోతుంది. ఆంధ్రా కాల్వ ద్వారా మండలంలో 21 చెరువులకు సాగు నీరు అందుతుంది. దాదాపు 15 వేల ఎకరాల్లో పంట సాగవుతుంది. ప్రస్తుతం ఆంధ్రాకాలువ పూడికుపోయి, ముళ్ల పొదలతో అధ్వానంగా తయారైంది. తక్షణం కాలువకు పూడిక తీసి గండ్లు పూడ్చి మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

బహిరంగ ప్రకటన

యావన్మంది ప్రజానీకానికి, 1. శ్రీమతి గుడిమెట్ల సత్య సీతామహాలక్ష్మి (లేటు) (2.) చిత్తపూరి నాగ సత్యా వెంకట దుర్గ రమామణి గార్ల తరఫున వారి న్యాయవాది శ్రీ పి.ఆర్.కె.అమరేంద్రకుమార్ (సెల్ నం. 9848415757) గుంటూరు వారు, వారి క్లయింట్లుకు జంగారెడ్డిగూడెం గ్రామంలో సర్వే నెం.344లో య.11.07 సెంట్లు భూమి కలదని, దానిలో య.4.00 సెంట్లు భూమిని నా క్లయింటు శ్రీ మండవల్లి నాగ వీర వెంకట సోమ శేఖర విజయసారధి (సోంబాబు) ఏవిధమైన హక్కులు లేకుండా అమ్మకమునకు ప్రయత్నించుచున్నారని కనుక ఆ భూమిపైన మరియు సర్వే నంబర్లు 263లో య.7.60 సెంట్లు ,342లో య. 8.08 సెంట్లు ,243లో య.9.50సెట్లు, గురవాయిగూడెం గ్రామంలోని సర్వే నం.69/1లో య.10.93 సెంట్లు, 69/2లో య.1.53 సెంట్లులో ఏ విధమయిన లావా దేవీలు జరిగినా అవి (1) శ్రీమతి గుడిమెట్ల సత్య సీతామహాలక్ష్మి (లేటు) (2.) చిత్తపూరి నాగ సత్యా వెంకట దుర్గ రమామణి గార్లకు ఎటువంటి సంబంధం లేదని కనుక పై భూములపై ఏవిధమైన లావాదేవీలు చేసిన అవి (1) శ్రీమతి గుడిమెట్ల సత్య సీతామహాలక్ష్మి (లేటు) (2.) చిత్తపూరి నాగ సత్యా వెంకట దుర్గ రమామణి గార్లు తీసుకొనే క్రిమినల్ మరియు సివిల్ చర్యలకు భాద్యులగుదురని ది.8.05.2025 తేదీన సాక్షి దినపత్రికలో ఇచ్చిన ప్రకటన చట్టప్రకారం చెల్లనేరదని సదరు ప్రకటనలోని విషయములు అవాస్తవములని ఈ బహిరంగ ప్రకటన ద్వారా ప్రజలందరికీ నా క్లయింటు శ్రీ మండవల్లి నాగ వీర వెంకట సోమ శేఖర విజయసారధి (సోంబాబు) తెలియజేయడమైనది.

నా క్లయింటు శ్రీ మండవల్లి నాగ వీర వెంకట సోమ శేఖర విజయసారథి (సోంబాబు) మరియు వారి తల్లిగారైన శ్రీమతి మండవల్లి గౌరి సుభద్ర అనువారలు 1వ పార్టీ గాను 1. శ్రీమతి గుడిమెట్ల సత్య సీతామహాలక్ష్మి (లేటు) (2.) చిత్తపూరి నాగ సత్యా వెంకట దుర్గ రమామణి వగైరాలు 2వ పార్టీ గాను పెద్దమనుషుల సమక్షములో ది 13.8.1997వ తేదీన ఇరు పార్టీల కోర్టు వ్యాజ్యములు మరియు భూమి తగాయిదాలను పరిష్కరించుకొనుచు ఫ్యామిలీ సెటిల్మెంట్ దస్తావేజును వ్రాసుకొని యున్నారు అందులో భాగంగా పై చెప్పబడిన సర్వే నంబర్లలోని భూములన్నియు నా క్లయింటు శ్రీ మండవల్లి నాగ వీర వెంకట సోమ శేఖర విజయసారథి (సోంబాబు) మరియు వారి తల్లిగారైన శ్రీమతి మండవల్లి గౌరి సుభద్ర అనువారలకు వాటాగా సంక్రమించినవి, సదరు విషయములు 1. శ్రీమతి గుడిమెట్ల సత్య సీతామహాలక్ష్మి (లేటు) (2.) చిత్తపూరి నాగ సత్యా వెంకట దుర్గ రమామణి గార్లకు విదితమే. తదుపరి నా క్లయింటు మరియు వారి తల్లిగారైన శ్రీ మతి మండవల్లి గౌరి సుభద్ర గార్లు వారికి ఉమ్మడిగా ది.13.8.1997వ తేదీన వ్రాసుకున్న ఫ్యామిలీ సెటిల్మెంట్ దస్తావేజులో (1వ పార్టీగా) నా క్లయింటు మరియు వారి తల్లిగారైన శ్రీమతి మండవల్లి గౌరి సుభద్ర గార్లకు సంక్రమించిన ఆస్తిని నా క్లయింటు మరియు వారి తల్లిగారైన శ్రీమతి మండవల్లి గౌరి సుభద్ర గారు ది.22.2.2018వ తేదీన రిజిస్టర్డు పంపకాల దస్తావేజు నం .1322/2018 ద్వారా పంపకాలు చేసుకొనగా నా క్లయింటు తల్లిగారైన గౌరి సుభద్రగారికి గురవాయిగూడెం గ్రామంలోని సర్వే నెం.69/2లో య.1.65 సెంట్లు, మరియు సర్వే నం.69/1సి లో య.2.61 సెంట్లు వారి వాటాగా మిగిలిన భూములు నా క్లయింటు శ్రీ మండవల్లి నాగ వీర వెంకట సోమ శేఖర విజయసారథి (సోంబాబు) గారి వాటాగా సంక్రమించినవి మరియు సదరు పంపకాల దస్తావేజు నం.1322/2018 లో సాక్షిగా శ్రీ చిత్తపూరి సోమ శేఖర్ S/O. రామకృష్ణారావు అనువారు సంతకం చేసినారని యావన్మందికి తెలియజేయడమైనది. తదుపరి నా క్లయింటు హక్కును అనుభవమును చట్టప్రకారం పరిగణనలోనికి తీసుకొని శ్రీ రెవెన్యూ అధికారి జంగారెడ్డిగూడెం వారు, గవర్నమెంటు వారి సాగు లెక్కలలో నమోదు చేసి హక్కు పత్రములు మంజూరి చేసియున్నారు. కావున నాక్లయింటు శ్రీ మండవల్లి నాగ వీర వెంకట సోమ శేఖర విజయసారథి (సోంబాబు)గారికి మరియు వారి తల్లిగారైన శ్రీమతి మండవల్లి గౌరి సుభద్ర అనువారలు పై చెప్పబడిన భూములకు హక్కుదారులని తెలియచేయడమైనది.

సదరు (1),శ్రీమతి గుడిమెట్ల సత్య సీతామహాలక్ష్మి (లేటు) (2.) చిత్తపూరి నాగ సత్యా వెంకట దుర్గ రమామణి వారలు ది 13.8.1997 నుండి ఇప్పటి వరకు నా క్లయింటుకు పై భూములపై గల హక్కును ఏవిధమైన వ్యాజ్యములు ద్వారా ప్రశ్నించలేదని అట్లు వ్యాజ్యములు దాఖలు చేసిన నంబర్లు, హక్కు పత్రములు ఇంతవరకు నా క్లయింటుకు గాని, సదరు (1), శ్రీమతి గుడిమెట్ల సత్య సీతామహాలక్ష్మి (లేటు) (2) చిత్తపూరి నాగ సత్యా వెంకట దుర్గ రమామణి గార్ల తరఫున న్యాయవాది శ్రీ పి.ఆర్.కె.అమరేంద్రకుమార్, గుంటూరు వారికి సమర్పించినట్లుగాని ది.8.5.2025వ తేదిన సాక్షి దినపత్రికలో జారీచేసిన బహిరంగ ప్రకటనలో పొందుపరిచలేదని తెలియచేసుకొనుచు, సదరు ది. 8,5,2025వ తేదీన (1), శ్రీమతి గుడిమెట్ల సత్య సీతామహాలక్ష్మి (లేటు) (2.) చిత్తపూరి నాగ సత్యా వెంకట దుర్గ రమామణి గార్లు వారి న్యాయవాదిగారి ద్వారా ఇచ్చిన బహిరంగ ప్రకటనను దురుద్దేశ పూర్వకంగా అక్రమ లబ్ధికోసం జారీచేసినదని తెలుపుతూ సదరు బహిరంగ ప్రకటనను ఉపసంహరించుకొనుచు ప్రకటన చేయవలసినదిగా ఈ ప్రకటన ద్వారా తెలియచేయడమైనది. లేని యెడల నా క్లయింటుకి వ్యక్తిగతంగానూ మరియు ఆస్తిపై నా క్లయింటుకి గల హక్కులపై దుష్ప్రచారం చేసినందులకు మీపై ((1),శ్రీమతి గుడిమెట్ల సత్య సీతామహాలక్ష్మి (లేటు) (2.) చిత్తపూరి నాగ సత్యా వెంకట దుర్గ రమామణి) చట్టప్రకారం తగు చర్య తీసుకోబడునని మీరిచ్చిన బహిరంగ ప్రకటన (తేదీ. 8.5.2025)కు సమాధానముగా తెలియచేయడమైనది.

జంగారెడ్డిగూడెం 13-05-2025

సం/- **ఎన్.వి.బి.ఎల్. ఆచారి,** న్యాయవాది
జంగారెడ్డిగూడెం, సెల్ : 94402 15126

ఎక్సైజ్ అధికారుల దాడులు

చింతలపూడి: నాగిరెడ్డిగూడెంలో భూక్యా శివ, భూక్యా శ్రీనులకు చెందిన 5 లీటర్ల సారా స్వాధీనం, 1100 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశఖూమని, వెంకటాపురం గ్రామంలో ఓ మహిళను అరెస్టు చేసి, లీటరు సారా, మరో మహిళ నుంచి 2 లీటర్ల సారా స్వాధీనం చేసుకోవడంతో పాటు బెల్లపు ఊటను ధ్వంసం చేశామని ఎక్సైజ్ సీఐ పి.అశోక్ మంగళవారం తెలిపారు. నామవరానికి చెందిన బానవతు సోమిలిని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశామన్నారు.

నలుగురి అరెస్ట్

బుట్టాయగూడెం: కొవ్వాడ గ్రామానికి చెందిన నాగబాబు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.వీరబ్రహ్మం మంగళవారం తెలిపారు. పాత కేసుకు సంబంధించి కొవ్వాడ, ఎల్ఎన్‌డీపేట గ్రామాల పరిధిలోని మరో ముగ్గుర్ని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపినట్టు చెప్పారు.

వేధింపుల కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వివాహిత ఫిర్యాదు మేరకు వరకట్న వేధింపుల కేసు నమోదు చేశామని ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. నరసాపురానికి చెందిన సురవరపు జోగేంద్ర సాయికుమార్‌కు జంగారెడ్డిగూడెంకు చెందిన ఉషా కమలకు 2023లో వివాహమైందన్నారు. ఆ సమయంలో రూ.30 లక్షల కట్నం కింద ఉషా కమల తల్లిదండ్రులు ఇచ్చారని తెలిపారు. అధిక కట్నం కోసం సాయికుమార్, అతని కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని, తనను చంపడానికి ప్రయత్నించారని కమల ఫిర్యాదు చేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

జగన్ పాలన కోసం జనం ఎదురుచూపు

కొయ్యలగూడెం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2.0 పాలన కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగరాజు పేర్కొన్నారు. మండల కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టిన గంగరాజును మంగళవారం బయ్యన్నగూడెం గ్రామంలో గవరవరం ఎంపీటీసీ బిరుదుగడ్డ రత్నకుమారి ఆధ్వర్యంలో సన్మానించారు. మెమెంటోను ప్రదానం చేశారు. కూటమి ప్రభుత్వ పాలన అవినీతిమయంగా మారిందని, సూపర్ సిక్స్ పథకాలు అమలు కావడం లేదని గంగరాజు అన్నారు. ప్రజల తరుపున పోరాడడంతో పాటు అవినీతిని ఎండగట్టాలని ఆయన సూచించారు. వీధికో బెల్టు షాపు ఉద్భవించిందని, వలంటీర్ల వ్యవస్థ ఉండగా సారా బెల్టు షాపులు లేకుండా పోయాయని అన్నారు. తనకు కన్వీనర్‌గా బాధ్యతలను అప్పగించడంలో కృషి చేసిన మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజులకు గంగరాజు కృతజ్ఞతలు తెలిపారు. కమిటీల పునర్నియామకం చేపడతామని, కష్టపడిన శ్రేణులకు తప్పకుండా గుర్తింపు ఇస్తామని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ యూత్ నేత బిరుదు గడ్డ ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కంభంపాటి బుజ్జిబాబు, పార్టీ నాయకులు బాలం వెంకటరామయ్య, పలివెల దుర్గరావు, వేముల సత్తిబాబు, వేముల వెంకన్న బాబు, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ దూలపల్లి కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.


గంగరాజును సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

మద్దిలో పూజలు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి వారి ఆలయంలో మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం వరకు దేవస్థానానికి వివిధ సేవల, విరాళాల ద్వారా రూ.1,87,132 సమకూరాయని ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు. సుమారు 1500 మంది భక్తులకు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారని పేర్కొన్నారు.


గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో అంజన్నను దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు


చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం


సుబ్రహ్మణ్యేశ్వరునికి పూజలు

గుర్వాయిగూడెం అయ్యప్ప ఆలయంలో కొలువైన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారి విగ్రహానికి అర్చకులు పంచామృత అభిషేకం చేశారు.

చండీహోమం

జంగారెడ్డిగూడెం నూకాలమ్మ ఆలయంలో చండీహోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. హోమ కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన చీకటి దివ్యతేజ, దుర్గా శారద దంపతులు, ముప్పన లక్ష్మణరెడ్డి, అనుపమ కుమారి దంపతులు, పోలవరానికి చెందిన పైల త్రిమూర్తులు, గౌరీ పార్వతి దంపతులు, అనిమిరెడ్డి రమేష్ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించినట్టు ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. అభయాంజనేయ భజనబృందం కోలాట భజనలు నిర్వహించారు.

హిందూ ధర్మ పరిరక్షణతోనే మనుగడ


స్వామి, అమ్మవార్లకు హారతులిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: హిందూ ధర్మ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని అర్చకులు, పండితులు ఉద్బోధించారు. శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో మంగళవారం సాయంత్రం వేద సభను నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో రథోత్సవం జరిగిన మరుసటి రోజు ఈ కార్యక్రమం నిర్వహించడం ఇక్కడ సాంప్రదాయంగా వస్తోంది. తొలుత స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి తొళక్క వాహనంపై మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ నిత్యకల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చారు. ఆ తరువాత కల్యాణ మండపంలో రజిత సింహాసనంపై కల్యాణ మూర్తులను వేంచేపుచేసి, విశేష పుష్పాలంకారాలు చేశారు. ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి అందించిన వివిధ రకాల ఫలాలు, పుష్పాలను స్వామివారి ముందుంచారు. శ్రీవారు, అమ్మవార్లు కొలువైన వేదిక ముందు అర్చకులు, వేద పండితులు, అధికారులు, ఆగమ విద్యార్థులు కొలువు తీరారు. స్వామి, అమ్మవార్ల గుణగణాలను కీర్తిస్తూ.. వేద మంత్రోచ్ఛరణలు నిర్వహించారు. అనంతరం శ్రీవారు, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు అర్చకులు హారతులిచ్చి, నీరాజన మంత్రపుష్పాలను సమర్పించారు. అర్చకులు, పండితులను ఆలయ ఈఓ ఘనంగా సత్కరించారు.

సార్వత్రిక సమ్మె పోస్టర్ విడుదల

కొయ్యలగూడెం: లేబర్ కోడ్ రద్దు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ పంచాయతీ కార్మికులకు జీతం టెండర్ రద్దు కోరుతూ ఈ నెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ పిలుపునిచ్చింది. ఈ మేరకు వాల్ పోస్టర్‌ను కొయ్యలగూడెంలో మంగళవారం నిర్వహించిన యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ రాంబాబు విడుదల చేశారు. పి.రాములమ్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో హైమావతి, సింహాచలం, టి.రాములమ్మ, పి.సులేమాన్ పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లకు రివార్డులు

జంగారెడ్డిగూడెం: చోరీకి గురైన సెల్‌ఫోన్‌ల రికవరీలో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిన జంగారెడ్డిగూడెం కానిస్టేబుల్ షానుబాబు మంగళవారం ఏలూరులో జరిగిన చోరీ సెల్‌ఫోన్‌ల పంపిణీ కార్యక్రమంలో ఎస్పీ కేపీఎస్ కిషోర్ చేతుల మీదుగా రివార్డు అందుకున్నారు. షానుబాబు మొత్తం 56 సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి జిల్లాలో ముందు వరుసలో నిలిచారు. ఈ సందర్భంగా రివార్డు అందుకున్న షానుబాబును డీఎస్పీ యు.రవిచంద్ర, సీఐ వి.కృష్ణబాబు, ఎస్సై షేక్ జబీర్, సిబ్బంది అభినందించారు.


ఎస్పీ నుంచి రివార్డు అందుకుంటున్న షానుబాబు


ప్రశంసా పత్రం అందుకుంటున్న రామాంజనేయులు

కానిస్టేబుల్‌కు ప్రశంస

కొయ్యలగూడెం: స్థానిక పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ వెజ్జు రామాంజనేయులు సెల్ ఫోన్ల రికవరీలో ప్రత్యేక కృషి చేసినందుకు ఎస్పీ నుంచి ప్రశంసా పత్రం అందుకున్నారని ఎస్సై వి.చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. ఆయన మొత్తం 38 మొబైల్స్‌లో 100 శాతం రికవరీ చేశారని, ఏలూరులో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ కిషోర్ చేతుల మీదగా ప్రశంస పత్రం అందుకున్నారని పేర్కొన్నారు.

గోసంరక్షణకు ఎండు గడ్డి విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి గోసంరక్షణ పథకానికి వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు 350 ట్రాక్టర్ల ఎండు గడ్డిని విరాళంగా అందజేశారు. వీటిని గత తొమ్మిది రోజులుగా కొండపైన గడ్డి నిల్వ చేసే ప్రాంతానికి తరలిస్తున్నారు. మంగళవారం పెద్ద ఎత్తున ట్రాక్టర్ల ద్వారా వచ్చిన గడ్డిని సిబ్బంది మేట్లుగా వేశారు.